చంద్ర‘బాదుడు’పై వెల్లువెత్తిన నిరసన

- విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్ సీపీ పోరుబాట
- కదం తొక్కిన కార్యకర్తలు, ప్రజలు



పామర్రులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

గుడివాడరూరల్ : కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ బిల్లుల సర్ చార్జీల మోత మోగిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు గుడివాడ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు విద్యుత్ బిల్లులపై పోరుబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పట్టణంలోని ఏలూరురోడ్డులో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నాయకులు నిరసన తెలిపి ప్రభుత్వం ప్రజలపై మోపిన భారానికి సంబంధించిన వినతిపత్రాన్ని విద్యుత్‌శాఖ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా మండలి హనుమంతరావు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులు పెంచబోమని మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పెంచి సర్ చార్జీల పేరుతో ప్రజలపై తీవ్ర భారాన్ని మోపడం సరికాదన్నారు. కార్యక్రమంలో నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, నందివాడ, గుడివాడ జెడ్పీటీసీ సభ్యులు కందుల దుర్గాకుమారి, గోళ్ల రామకృష్ణ, నాయకులు పాలేటి చంటి, షేక్ సయ్యద్, బాజీ, దుడ్డు చిన్న, కోటప్రోలు నాగు, కందుల నాగరాజు, తోట నాగరాజు, గంటా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

> పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ చేపట్టిన పోరుబాటకు ప్రజలు సంపూర్ణ మద్దతు పలికారు. వేలాది మందిగా పోరుబాట ర్యాలీలో పాల్గొన్నారు. ‘చంద్రబాబు డౌన్ డౌన్.. పెంచిన చార్జీలను తగ్గించాలి’ అని నినాదాలు చేశారు. అనంతరం ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.



గుడివాడ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న మండలి, నాయకులు



పామర్రులో విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న, కైలే అనిల్‌కుమార్

ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్

పామర్రు: కూటమి ప్రభుత్వం ప్రస్తుతం విద్యుత్ వినియోగదారులపై రూ.15 వేల కోట్ల అదనపు భారం మోపి ప్రజలను తీవ్రంగా మోసం చేసిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. పెరిగిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం పామర్రులో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు, విద్యుత్ వినియోగదారులు అందరూ కలిసి స్థానిక పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం నుంచి నాలుగురోడ్ల కూడలి గుండా స్థానిక విద్యుత్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ కొనసాగింది. ‘పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి, చంద్రబాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారెంటీ, కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్’ అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని విద్యుత్‌శాఖ అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆరు నెలల కాలంలోనే చార్జీలను పెంచి ప్రజలను మోసం చేసిందన్నారు. చంద్రబాబు పాలనలో ఏ వర్గానికి చెందిన వారు కూడా సంతోషంగా లేరన్నారు. విద్యార్థులు, మహిళలు, రైతులు అందరూ ఇబ్బందులు పడుతున్నారన్నారు.

చార్జీలు ఉప సంహరించేదాకా ఉద్యమమే..

పెంచిన విద్యుత్ చార్జీల భారాన్ని ప్రభుత్వం తగ్గించే వరకు ఉద్యమాన్ని ఉపసంహరించేది లేదని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. చంద్రబాబు మాదిరిగా హామీలు ఇచ్చి చేతులెత్తేయండా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెలియదన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల కాలంలో ఆడిన మాట తప్పి చంద్రబాబు తన నిజ స్వరూపాన్ని బహిర్గతం చేశారన్నారు. సూపర్ సిక్స్ సహా హామీలు అన్నీ తుంగలో తొక్కారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎస్సీ,ఎస్టీల ఇళ్లకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తే కూటమి ప్రభుత్వం దానని వారి నుంచి దూరం చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలన్నారు. ఎంపీపీలు దాసరి అశోక్‌కుమార్, గోగం సురేష్, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, అరుమళ్ల రమాదేవి, సాంబశివారెడ్డి, కొడమంచిలి మహేష్, ఎంపీటీసీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, కె.నాగమల్లేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, కళ్లం వెంకటేశ్వరరెడ్డి, రాజులపాటి రాఘవరావు, పామర్రు ఉప సర్పంచ్ బాలవెంకటేశ్వరరెడ్డి, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నాగేంద్ర, కె.శ్రీనివాసరావు, తిరుమలశెట్టి వాసు, పెదవెంకటరెడ్డి, నత్తా నాని, రవి, చిన్నం శ్రీనివాసరావు, కొచ్చెర్ల శ్రీనివాసరావు, కె.సురేష్, సురేష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, కె.రాంబాబు, ఉమ్మడిశెట్టి శ్రీలక్ష్మి, రూబేన్, నామా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



మండవల్లి: యూటీఎఫ్ నాయకత్వం తయారు చేసిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను పలు పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. లింగాల జెడ్పీ ఉన్నత పాఠశాల, లోకుమూడి ఉన్నత పాఠశాల, పుట్లచెరువు పాఠశాలలో యూటీఎఫ్ నాయకులు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. యూటీఎఫ్ జిల్లా నాయకుడు సీహెచ్ పిచ్చోడు, మండల జనరల్ సెక్రటరీ మేడా శ్రీనివాసరావు, కె.ఆనంద్‌కుమార్, మండవల్లి కమిటీ ఎండీ సుఫియాన్, ఆశీర్వాదం, హైస్కూల్ హెచ్ఎం వెంకటేశ్వరరావు, వాకా శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

కైకలూరు: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చేసిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఎన్నార్‌తోపాటు పలువురు నాయకులు మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఆయన మరణం దేశానికి తీరని లోటని డీఎన్నార్ చెప్పారు.కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి ఎంపీడీఓ సీతామహాలక్ష్మి శుక్రవారం నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ భారత ఎకానమీపై చెరగని ముద్ర వేశారని ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ అన్నారు. స్థానిక కార్యాలయం మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. సభ్యులు వెంకటనాంచారయ్య, వేణుగోపాల్, అప్పారావు, రామారావు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి మండవల్లి సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ఘనంగా నివాళులర్పించారు. మెండ సురేష్, సెక్రటరీ సాయి ప్రదీప్ పాల్గొన్నారు

వీకేఆర్ ఫెస్ట్ ప్రారంభం



గుడివాడరూరల్: స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ పాలిటెక్నిక్ కళాశాల్లో శుక్ర, శనివారం 2024 ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నాగు పేర్కొన్నారు. ఈ ఫెస్ట్‌ను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కళాశాల డైరెక్టర్ బి.కల్యాణ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ లోయ రాజా, ఏఓ తుమ్మల వెంకటరమణ, డీన్ దుర్గాప్రసాద్, ఫెస్ట్ కన్వీనర్ రామస్వామి పాల్గొన్నారు.

లైబ్రరీ అసిస్టెంట్ మృతి

మండవల్లి: మండవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో లైబ్రరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎల్.నాగమల్లేశ్వరరావు శుక్రవారం గుండెపోటుతో మృతి చెందినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఆయన మృతికి హెచ్ఎం, ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు.

వాలీబాల్ రిఫరీగా నాగరాజు

కైకలూరు: ప్రముఖ ఆధ్యాత్మిక సేవా సంస్థ ఈశా ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా కోయంబత్తూరులో నిర్వహించే జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంటుకు ప్రత్యేక రిఫరీగా కైకలూరు మండలం శృంగవరప్పాడుకు చెందిన బలే నాగరాజుకు ఆంధ్రప్రదేశ్ తరఫున ఆహ్వానం అందింది. ఈ నెల 27 నుంచి 30 వరకు కొనసాగే ఈ టోర్నమెంటుకు రిఫరీగా నాగరాజు వ్యవహరించనున్నారు.

రంగరాజన్ కమిషన్‌కు అర్జీలు అందజేయాలి



విలేకరులతో మాట్లాతున్న ఎస్సీ నాయకులు

గుడివాడరూరల్: మచిలీపట్నానికి శనివారం రానున్న రెండు తెలుగు రాష్ట్రాల రంగరాజన్ మిశ్ర కమిషన్‌కు ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ మాల మహానాడు నాయకులు వినతిపత్రాలను అందించాలని అఖిలభారత మాల సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడు పొంగులేటి జయరాజు పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాల, మాదిగలను పూర్తిగా విడదీసేందుకు బీజేపీ కుట్ర చేస్తుందని ఆరోపించారు. కేంద్రమంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను కూడా విమర్శించారని గుర్తు చేశారు. సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణ చేసేందుకు మంద కృష్ణమాదిగ చేతులు కలిపి జాతికి ద్రోహం చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు దారం కరుణాకర్, కోటే రామచంద్రరావు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకే సదస్సులు



పెదపాలపర్రు సదస్సులో మాట్లాడుతున్న సిసోడియా

ముదినేపల్లి రూరల్: దీర్ఘకాలికంగా పరిష్కారం కాని భూముల సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా అన్నారు. మండలంలోని పెదపాలపర్రులో రెవెన్యూ గ్రామసభ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిసోడియా మాట్లాడుతూ భూములకు సంబంధించి అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. వీటి పరిష్కారానికి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏలూరు, గుంటూరు, కృష్ణా జిల్లాల పరిధిలో 44వేల ఎకరాల ఆలయాల భూములకు సంబంధించి సమస్యలు నెలకున్నాయని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ నియోజకవర్గంలోని భూములకు సంబంధించిన పలు సమస్యలను సిసోడియా దృష్టికి తెచ్చి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ధాత్రీరెడ్డి, ఏలూరు ఆర్డీఓ అంబరీష్, తహసీల్దార్ సుభానీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడరూరల్: సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రామకోటేశ్వరరావు అన్నారు. మండలంలోని సిద్ధాంతం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పీడీఎస్ డెప్యూటీ తహసీల్దార్ కిరణ్, ఆర్ఐ నాగబాబు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కే గోపాల్ అన్నారు. మండలంలోని గన్నవరం, మొఖాసాకలవపూడిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గన్నవరంలో 4, మొఖాసాకలవపూడిలో 6 అర్జీలు వివిధ సమస్యలపై అందజేశారని అధికారులు తెలిపారు. డెప్యూటీ తహసీల్దార్ సుధారాణి ఆర్ఐ శ్రావణి, వీఆర్వో నరేష్ పాల్గొన్నారు.

వడ్లమన్నాడులో..

గుడ్లవల్లేరు: వడ్లమన్నాడు రెవెన్యూ సదస్సులో అర్జీలను తహసీల్దార్ బి.లోకరాజు స్వీకరించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయ ఈఓ ఆకుల కొండలరావు, ఎంఆర్ఐ పి.శివకుమార్, మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా, వైఎస్సార్ సీపీ నాయకుడు కె.ప్రవీణ్, కూటమి నాయకులు రాంబాబు, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మాజీ ఏఎస్పీ చేయూత



విద్యార్థులకు ఆర్థికసాయం చేస్తున్న సుశీలరావు

గుడ్లవల్లేరు: విన్నకోటకు చెందిన మాజీ ఏఎస్పీ శాయన సుశీలరావు విద్యార్థులకు శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. గుడ్లవల్లేరులో ఇంజినీరింగ్ చదువుతున్న లింగం శివకుమార్‌తో పాటు మరొక విద్యార్థిని ఎ.రిషితకు ఒకొక్కరికి రూ.5వేల చొప్పున శాయన వీర భద్రయ్య, వీర రాఘవమ్మ సేవా సమితి ద్వారా వారి కుమారుడు సుశీలరావు రూ.10వేల సాయం చేశారు.

సైగలతో వేధించినా ర్యాగింగ్ కేసు

సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి



విద్యాంజలి కాలేజీలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి

కైకలూరు: విద్యార్థులను సైగలతో వేధించినా, అసభ్యకరంగా తిట్టినా ర్యాగింగ్ కేసు నమోదు చేయవచ్చని సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి పేర్కొన్నారు. కైకలూరు విద్యాంజలి కళాశాల్లో తాలూకా లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలన, ర్యాగింగ్, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా అంశాలపై విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దారిద్ర్యరేఖ దిగువ ఉన్న కుటుంబాలు కేసుల విషయంలో కోర్టును ఆశ్రయిస్తే ఉచితంగా న్యాయ సహాయాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాది పి.పవన్‌కాంత్, ప్రిన్సిపాల్ జమీల్ అహ్మద్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

సుప్రీం కోర్టు ఆదేశాలతో మాదక ద్రవ్యాల వినియోగ పరిణామాలు, ర్యాగింగ్, బాల్య వివాహాలపై వ్యాసరచన, షార్ట్ ఫిలిం తదితర అంశాలపై ఈ నెల 18న విద్యాంజలి కాలేజీలో పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ చూపిన వారికి జడ్జి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

మెప్మా బజారును ఆదరించండి

గుడివాడరూరల్: మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం నిర్వహించే మెప్మా బజారును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా మేనేజర్ కేఈపీ బసవేశ్వరరావు శుక్రవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మున్సిపల్ పరిధిలోని స్వయం సహాయక సభ్యులు తయారు చేస్తున్న వస్తువులు, తిను బండారాల అమ్మకాలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని పేర్కొన్నారు. వివిధ రకాల సేవలను అందించే వారు తమ పేర్లను ఈ మెప్మా బజారు వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడరూరల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని బాపూజీనగర్, శ్రీకాళహస్తీ కాలనీ, కృష్ణవేణి ఆగ్రో, నైజాంపేట, గుడ్‌మన్‌పేట, పాములకాలనీ, పంచవటికాలనీ ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థినులకు ప్లేట్ల పంపిణీ

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల్లో శుక్రవారం విద్యార్థునులకు భోజన ప్లేట్లు, బౌల్స్ పంపిణీని చేశారు. తమ సోదరి నిమ్మగడ్డ పద్మ స్మారకార్థం తాను రూ.10వేల సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వై రామకృష్ణ తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో పలు అంశాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకుంటారని పేర్కొన్నారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

సంక్షిప్త వార్తలు

బాల్య వివాహాలను అరికట్టాలి

నందివాడ: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ మల్లీశ్వరి పేర్కొన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో కిషోర్ వికాసంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బాల్యవివాహాలను నివారించాల్సిన బాధ్యత సమాజంలో అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గుడివాడ సీడీపీఓ విజయ్, డీటీ మల్లిక, సూపర్‌వైజర్ నాగశిరీష భవాని, ఏపీఎం వసంతరావు పాల్గొన్నారు.

కలిదిండి మండల మాలమహానాడు అధ్యక్షుడిగా అశోక్

కలిదిండి(కైకలూరు): మాలమహానాడు మండల అధ్యక్షుడిగా భూపతి అశోక్ నియామితులయ్యారు. కొచ్చర్లలో నిర్వహించిన సభలో రాష్ట్ర మాలమహానాడు, అనుబంధ సంఘాల అధ్యక్షుడు డాక్టర్ సేవా నాగజగన్ బాబూరావు చేతుల మీదుగా నియామకపత్రాన్ని శుక్రవారం అందుకున్నారు. రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు జక్కుల విజయకుమార్, నియోజకవర్గం మాలమహానాడు ఉపాధ్యక్షుడు జ్యోజిబాబు, నాయకులు ప్రతాప్‌కుమార్, సత్యానందం పాల్గొన్నారు.

వీఆర్వోల అసోషియేషన్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్

కైకలూరు: వీఆర్వోల సంఘ మండల అధ్యక్షుడిగా కె.చంద్రశేఖర్ (వేమవరప్పాడు) శుక్రవారం ఎన్నికయ్యారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఏలూరు జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జాయింట్ సెక్రటరీ, వరహాపట్నం వీఆర్వో బీఆర్ సుబ్బారావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఉపాధ్యక్షురాలిగా రంగనాయకమ్మ, సంఘ సెక్రటరీగా ప్రసాదరావు, ట్రెజరర్‌గా పి.రాజబాబు, జాయింట్ సెక్రటరీగా ఎన్.సాయికుమార్ ఎన్నికయ్యారు.

ఆరోగ్య పరిరక్షణకు ఆయుర్వేద వైద్యం

పామర్రు: మానవాళి ఆరోగ్య పరిరక్షణకు ఆయుర్వేదమే ఉపయోగపడుతుందని సిరిగిరి ఆయుర్వేద ఫార్మసీ వైద్యులు డాక్టర్ లక్ష్మణరాజు పేర్కొన్నారు. స్థానిక నాలుగురోడ్ల కూడలిలో శుక్రవారం సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి ప్రసాదించిన వివిధ ఔషధ మొక్కలతో సంపూర్ణ ఆరోగ్యం అనే అంశంపై అవగాహన కల్పించారు.

క్రీడాపోటీలు ప్రారంభం

గుడివాడరూరల్: ప్రైవేట్ స్కూల్స్ డెమోక్రటిక్ అసోసియేషన్ గుడివాడ డివిజన్ ఆధ్వర్యంలో గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ క్రీడాపోటీలను స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శి యలవర్తి శ్రీనివాసరావు, రంగప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. గుడివాడ, గుడ్లవల్లేరు, పామర్రు, నందివాడ ఎంఈఓలు, 33 ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్లు, అసోసియేషన్ అధ్యక్షుడు అర్జా ప్రసాద్ పాల్గొన్నారు.

ఆదిశైవ సంఘ జిల్లా కార్యదర్శిగా శంకర శాస్త్రి

కైకలూరు: ఆదిశైవ అర్చక సంఘ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శిగా చావలి శంకర శాస్త్రి నియమితులయ్యారు. ఆ సంఘ అధ్యక్షుడు మురమళ్ల రాంబాబు అధ్యక్షతన ద్వారకా తిరుమలలో శుక్రవారం శంకరశాస్త్రి ప్రమాణ స్వీకారం చేశారు. నియోజకవర్గం నుంచి కార్యదర్శులుగా గూడూరి శ్రీనివాస్, సుధాకరచక్రవర్తి శర్మ, రుద్రపాక బాపూజీ శర్మ, ఐలూరి తారక రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ముదినేపల్లి రూరల్: బొమ్మినంపాడులో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మినుముకు సోకే తెగుళ్లను నివారించేందుకు వినియోగించే కషాయాలను వివరించారు.

లలితా సహస్రనామ పారాయణ

పామర్రు: స్థానిక విష్ణాలయంలో లలితా పారాయణ మండలి సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం సహస్రనామ పారాయణను నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామికి విశేషంగా పూజా కార్యక్రమాలను చేసి స్వామి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. రొంపిచర్ల కాశీ విశాలక్ష్మి, కామేశ్వరీ, దుర్గా, విజయశ్రీ, పద్మలత పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో నగర సంకీర్తన

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం నుంచి మహిళా భక్తులు శ్రీమన్నారాయణుడి నగర సంకీర్తనను శుక్రవారం ఉదయం చేపట్టారు. ఈ ధనుర్మాసంలో శ్రీమన్నారాయణుడి లీలలపై గానం చేయటం ద్వారా ఆ భక్తులపై స్వామి కృప ఉంటుందని వేద పండితుడు రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు తెలిపారు.

